# కాంగ్రెస్ కవచం బీజేపీ!

▸ Iవ తరువాయి...

బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎం అయిపోయిందని ప్రధాని మోదీయే ఇక్కడ అంటారు. మరి ఎందుకు విచారణ జరపకుండా మౌనంగా ఉన్నారు. ట్రిపుల్‌ఆర్ సినిమా కన్నా ఆర్‌ఆర్ (రాహుల్-రేవంత్) ట్యాక్స్‌లు ఎక్కువ అయ్యాయని ప్రధాని మోదీయే అన్నారు. కానీ, రేవంత్‌రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? సీఎం రేవంత్‌రెడ్డి తన బావమరిదికి అక్రమంగా అమృత్ టెండర్లు కట్టబెట్టారని మేము ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు కేంద్రం నుంచి సమాధానం లేదు. మూసీ పేరుతో లక్షన్నర కోట్లు లూటీ చేస్తుంటే బీజేపీ వాళ్లు ప్రశ్నించటం లేదు. మణికొండలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను పంచుకున్నాయి. ఇవన్నీ బీజేపీ, కాంగ్రెస్ అక్రమ బంధానికి నిదర్శనాలు కావా?' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. 'మూసీ విషయంలో బీజేపీ ఎట్టకేలకు స్పందించింది. రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌కు బీజేపీ నాయకులు స్పందించి ఇవ్వాళ మూసీ పక్కన పండుకుంటారట. చాలా సంతోషం. మూసీలో జరుగుతున్న అక్రమాలపై అడగండి. లక్షన్నర కోట్లు ఎవడి అబ్బ సొత్తని ఖర్చు చేస్తారో అడగండి. అడగటంతోనే ఆగకుండా విచారణ కూడా చేపట్టాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### తెలంగాణను కేసీఆర్ నంబర్ వన్ చేశారు

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో హైదరాబాద్‌లో ముఖ్యంగా రాజేంద్రనగర్‌తోపాటు పలు నియోజకవర్గాల్లో అనుమానాలు ఉండేవి. హైదరాబాద్‌కు పెట్టుబడులు రావు. ఉన్న పెట్టుబడులు తరలిపోతాయి. అభివృద్ధి కుంటుపడతది. హిందూ-ముస్లింల మధ్య గొడవలు జరుగుతాయని కొందరు ప్రచారం చేశారు. కానీ, కేసీఆర్ అభివృద్ధే కులంగా, సంక్షేమమే మతంగా అభివృద్ధి చేసి అవన్నీ ఉత్త ప్రచారాలే అనేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దారు. దేశంలో తెలంగాణను ఎన్నో రంగాల్లో రోల్ మాడల్‌గా నిలిపారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి కారణంగానే రాజేంద్రనగర్‌లో ప్రకాశ్‌గౌడ్‌ను ప్రజలు గెలిపించారు. పదవులు, పైరవీల కోసం అక్కడి ఎమ్మెల్యే పార్టీ మారినా మేమున్నామని కార్యకర్తలు పార్టీ వెంటే నిలవటం గర్వంగా ఉన్నది' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ చైతన్యానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా.. రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే పశ్చాత్తాప పడేరోజు వస్తది. రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయి. మీ ఎమ్మెల్యే రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నడు తప్ప మీరు తప్పు చేయలేదు. మీరంతా పార్టీ వెన్నంటే ఉన్నరు. పార్టీలో కార్తీక్‌రెడ్డి పోరాట పటిమ ప్రదర్శిస్తున్నారు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

### ఎవరు మేలు చేస్తారో ప్రజలకు అర్థమైంది..

'మూసీ బాధితప్రాంతాల్లో పర్యటించాం. రాజేంద్రనగర్ నియోజకవర్గం మొత్తం దాదాపు ఐదారు వందల కుటుంబాలను కలిశాం. హిందూ ముస్లిం అనే తేడా లేకుండా మాతో బాధలు పంచుకున్నారు. తమకు ఎవరు మేలు చేస్తారో, ఎవరు చేయరో, కష్టం వచ్చినప్పుడు ఎవరు తమతో ఉన్నారో అర్థమైందని చెప్పారు. 40-50 ఏండ్ల నుంచి ఉన్న భూములకు రిజిస్ట్రేషన్లు చేసి ట్యాక్స్‌లు కట్టించుకొని కబ్జాదారులు అంటారా? కోట్ల విలువ చేసే ఇండ్లను కూలగొట్టి...దిక్కులేని వాళ్లను చేస్తారా? అని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు' అని కేటీఆర్ వెల్లడించారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న నేతలకు గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కేటీఆర్. చిత్రంలో సబితా ఇంద్రారెడ్డి, కాలేరు వెంకటేశ్, చందర్, కార్తీక్‌రెడ్డి

### గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెడితే ఊరుకుందామా?

'మనం గట్టిగా మూసీ గురించి అడిగితే కొత్త పల్లవి ఎత్తుకున్నారు. బాపుఘాట్ వద్ద అతిపెద్ద మహాత్మాగాంధీ విగ్రహాన్ని పెడతామని చెప్తున్నారు. గాంధీజీకి విగ్రహాలు ఇష్టం ఉండవని అవే డబ్బులతో పేదవాళ్లకు మంచి చేయాలని మహాత్మాగాంధీ మనుమడు తుషార్‌గాంధీ చెప్పారు. గాడ్సే శిష్యుడు, గాడ్సే వారసుడు రేవంత్‌రెడ్డి. గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెడితే ఊరుకుందామా? మహాత్మాగాంధీ విగ్రహాన్ని అడ్డుపెట్టుకొని శిఖండి రాజకీయాలు చేస్తామంటే మంచిది కాదు. ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలకు పైసలు లేవంట. మూసీకి లక్షన్నర కోట్లు మాత్రం ఉన్నాయట. కాళేశ్వరం ప్రాజెక్ట్ కడితే ఎంత ప్రయోజనం అంటూ ప్రశ్నించారు కదా? మరి మూసీతో మురిసే రైతులెందరు?, మూసీతో కొత్తగా సాగులోకి వచ్చే ఆయకట్టు ఎంత? మూసీ మూటల్లో మీ వాటా ఎంత? అని కేటీఆర్ నిలదీశారు.

> రేవంత్‌రెడ్డితో మాకు గట్టు పంచాయితీ ఏమీ లేదు. కొడంగల్‌లో గిరిజనుల భూమి గుంజుకోవటంపై ప్రశ్నిస్తే ఆయనకు కోపం వస్తున్నది. మూసీ కుంభకోణం గురించి ప్రశ్నిస్తే కోపం వస్తున్నది. అర్హత లేని బావమరిది కంపెనీకి అమృత్ టెండర్లు కట్టబెట్టడంపై అడిగితే కోపం వస్తున్నది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీద ఈడీ రైడ్స్ గురించి అడిగితే కోపం వస్తున్నది. ఏదో కేసులు పెట్టి జైల్లో పెడితే ప్రశ్నించటం మానేస్తామని అనుకుంటున్నారేమో! నేను జైలుకు పోతే వందలాది మంది కేసీఆర్, కేటీఆర్‌లు పుట్టుకొస్తారు.
>
> -కేటీఆర్

### ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం శాశ్వతం

'కష్టాలు ప్రతి మనిషికి వస్తాయి. మనకు కూడా వచ్చాయి. గెలుపోటములు కొత్త కాదు. కానీ, వాటిని మనం గట్టిగా ఎదుర్కోవాలి. 2001లో కేసీఆర్ పార్టీ పెట్టినప్పుడు ఆయన వెంట పిడికెడు మంది ఉండె. 24 ఏండ్లలో ఇంతింతై వటుడింతై అన్నట్టుగా రాష్ట్రం నలుమూలలా బీఆర్‌ఎస్ బలంగా మారింది. పల్లెలు, పట్టణాల్లో ఇవాళ పార్టీకి లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నారు. ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం శాశ్వతంగా ఉంటుంది' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

### దేవుళ్లనే మోసం చేసిన మొదటి వ్యక్తి రేవంత్

'రేవంత్‌రెడ్డి టెక్నికల్ ప్రాబ్లమ్స్‌తో ఎత్తయిన కుర్చీలో కూర్చుంటున్నారు. ఎత్తయిన కుర్చీలో కూర్చుంటే పెద్దోళ్లు అయిపోరు. కేసీఆర్ రైతుబంధు రూ.10 వేలే ఇసున్నడు.. మేము రూ.15 వేలు ఇస్తమంటివి.. కేసీఆర్ లక్ష రుణమాఫీ చేస్తే నేను రెండు లక్షలు చేస్తా అంటివి. సోనియమ్మ బర్త్‌డే నాడే చేస్తా అంటివి. ఏడాది అయిపోయింది. మళ్లీ సోనియమ్మ బర్త్ డే డిసెంబర్ 9 వస్తున్నది. ఇప్పటి వరకు రైతు రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వలేదు. సోనియాగాంధీని మాత్రమే కాదు. మొత్తం ప్రజలందరినీ రేవంత్ రెడ్డి మోసం చేశారు. దేవుళ్లను మోసం చేసిన మొదటి వ్యక్తి ఈ రేవంత్‌రెడ్డి. ఒక్క హిందూ దేవుళ్లనే కాదు.. అన్ని మతాల దేవుళ్లను మోసం చేశారు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

### మూసీ మురుగుకు కారణం ఎవరు?

'మూసీకి పునరుజ్జీవం అని రేవంత్‌రెడ్డి పదే పదే చెప్తున్నారు. గత 60 ఏండ్ల నుంచే మూసీలోకి మురుగు నీళ్లు వస్తున్నాయి. మూసీ మురికికూపం కావటానికి కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలే కారణం. అప్పుడు ఇదే రేవంత్‌రెడ్డి ఆ పార్టీల్లోనే ఉన్నారు. మేము మాత్రమే మూసీని బాగు చేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నం చేశాం. మూసీని తిరిగి బతికించాలంటే ముందు మురుగు నీటిని శుద్ధి చేయండని కేసీఆర్ మాకు చెప్పారు. ఆయన దాదాపు రూ.4 వేల కోట్లతో 1200 ఎంఎల్డీల ఎస్టీపీలను నిర్మించారు. దేశంలోనే అతి పెద్ద ఎస్టీపీలను హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించింది. చిత్తశుద్ధితో పనిచేయటంతో 100 శాతం మురుగునీటి శుద్ధి నగరంగా హైదరాబాద్ నిలిచింది. 80 శాతం మూసీ శుద్ధి ఎస్టీపీల నిర్మాణంతో పూర్తి అయినట్టే' అని కేటీఆర్ వివరించారు.

### ఖర్గేజీ.. మేకలను కొన్నట్టు ఎందుకు కొంటున్నరు?

'రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ఎందుకు పార్టీ మారాడో ప్రజలు అడగాలి. అభివృద్ధి కోసం పోయిన అంటే కేసీఆర్ కన్నా రేవంత్‌రెడ్డి ఏం అభివృద్ధి చేసిండో చెప్పుమనాలి. కేసీఆర్ రూ.9,500 కోట్లతో అభివృద్ధి చేశారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. మరి అభివృద్ధి కోసం పోతే మరో వెయ్యి కోట్లు ఎక్కువ తెచ్చి అభివృద్ధి చేయాలి కదా? ఎమ్మెల్యేలను బీజేపీ వాళ్లు మేకలను కొన్నట్టు కొంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖరే చెప్తున్నారు. ఖర్గేను తెలంగాణకు రమ్మని చెప్తున్న.. ఇక్కడ మా మేకలు మీ మందలో తప్పిపోయాయి చూడాలని కోరుతున్న. మా ఎమ్మెల్యేలను మేకలను కొన్నట్టు ఎందుకు కొంటున్నారు అని అడుగుతున్న. ప్రకాశ్‌గౌడ్, గాంధీలకు సిగ్గుందా? ఏ పార్టీలో ఉన్నారో చెప్పే దమ్ముందా? రాజేంద్రనగర్‌లో ఉపఎన్నిక రావటం ఖాయం. ఉపఎన్నికల్లో గులాబీ జెండా ఎగరటం ఖాయం. రాజేంద్రనగర్‌ను భవిష్యత్తులో అద్భుతంగా ముందుకు తీసుకెళ్లే నాయకుడు కార్తీక్‌రెడ్డి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

### మూసీకి రూ.1100 కోట్లు ఖర్చు చేస్తే చాలు

'మేడిగడ్డ నుంచి నీళ్లను తీసుకొచ్చి కొండపోచమ్మసాగర్ ద్వారా గండిపేటకు తేవాలని నిర్ణయించాం. ఓవైపు వ్యవసాయానికి నీళ్లు, మరో వైపు పట్టణాలు, హైదరాబాద్‌కు నీళ్లు తెచ్చేలా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాం. గోదావరి నుంచి గండిపేటకు నీళ్లు తెచ్చేందుకు గతేడాది మేలోనే తీర్మానం పాస్ చేశాం. 1100 కోట్లతో గండిపేట గేట్లు ఎత్తితే కిందకు ఫ్రెష్ వాటర్ ఇచ్చేలా ప్లాన్ చేశాం. మూసీ మీద దాదాపు 15 బ్రిడ్జిలు కూడా మంజూరు చేశాం. ఆ బ్రిడ్జిల కిందనే చెక్‌డ్యామ్‌లు, మూసీలో ఎప్పుడూ నీళ్లుండి దాన్ని జీవనదిగా చేసేందుకు అన్నీ సిద్ధం చేశాం. కేవలం రూ.1100 కోట్లు ఖర్చు చేస్తే చాలు.. మూసీ పునరుజ్జీవం జరిగినట్టే. కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తాడంట. ఎందుకు అంత ఖర్చు అంటే ఒక్కడూ సమాధానం చెప్పడు.' అని కేటీఆర్ మండిపడ్డారు.

### ఢిల్లీకి మూటలు పంపే పనిలో రేవంత్

'రేవంత్‌రెడ్డి పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటిది. ఢిల్లీ వాళ్లకు కోపం వస్తే పదవి ఎప్పుడు ఊడుతుందో తెలియదు. రాహుల్‌గాంధీకి డబ్బులు కావాలి. ప్రియాంకగాంధీ కూడా ఉన్నారు. వాళ్లకు డబ్బులు పంచాల్సిందే. అందుకే రేవంత్ మూటలు పంపే పనిలో ఉన్నారు. తెలంగాణలో పదేండ్లలో భారీగా భూముల ధరలు పెరిగాయి. అప్పుడు మేము పారదర్శకంగా భూములు వేలం వేస్తే ఎకరా వంద కోట్లకు పోయింది. అప్పుడు కూడా అందులో స్కాం ఉన్నదని రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఓఆర్‌ఆర్ లీజును ఒక సంస్థకు రూ.7 వేల కోట్లకు ఇస్తే లక్ష కోట్లు వచ్చేదాన్ని రూ.7 వేల కోట్లే ఇచ్చారన్నారు. మరి ఇప్పుడు మున్సిపల్ మినిస్టర్ నువ్వే కదా? ఆ టెండర్ రద్దు చేసి రూ.లక్ష కోట్లు తీసుకురా. నేను కోకాపేట భూముల్లో అవినీతి చేశానని అన్నావ్. విచారణ జరుపు. తప్పు చేస్తే శిక్ష వెయ్యి' అని కేటీఆర్ సవాల్ విసిరారు.

> మణికొండలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను పంచుకున్నాయి. మణికొండ, మక్తల్, భువనగిరిలో కలిసి కాపురం చేస్తున్నది ఎవరు? ఇవి బీజేపీ, కాంగ్రెస్ అక్రమ బంధానికి నిదర్శనాలు కావా? మళ్లీ వాళ్లే సిగ్గు లేకుండా మాట్లాడుతున్నరు. బీజేపీ, బీఆర్‌ఎస్ పదవులు పంచుకున్నట్టు ఒక్క ఉదాహరణ అయినా చూపించగలరా?
>
> -కేటీఆర్

### రాహుల్‌గాంధీ లీడర్ కాదు రీడర్!

'రాహుల్‌గాంధీ అమాయకుడు. పాపం రాసిచ్చింది చదువుతారు. ఆయన లీడర్ కాదు.. రీడర్. అదానీని వ్యతిరేకిస్తూ అక్కడ రాహుల్‌గాంధీ మాట్లాడుతారు. కానీ ఇక్కడ రేవంత్‌రెడ్డి అదానీకి రెడ్ కార్పెట్ వేస్తారు. బాంబుల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అమావాస్యకు బాంబులు కొంటే కార్తీక పౌర్ణమి నాటికి కూడా పేలుతలేవు. ఆయన తుస్సు బాంబుల శాఖ మంత్రి. పొంగులేటి ఇంటి మీద ఈడీ దాడులు జరిగి 45 రోజులైంది. అదే బీఆర్‌ఎస్ వాళ్ల ఇండ్లపై ఈడీ దాడిచేస్తే పెన్ను దొరికింది.. గుండుపిన్ను దొరికింది అంటూ నిమిష నిమిషానికి మీడియాకు లీకులిచ్చే ఈడీ, బీజేపీ వాళ్లు.. ఇప్పటి వరకు ఒక్క ప్రకటన కూడా చేయటం లేదు' అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

### ప్రజలకు కాంగ్రెస్ ధోకా: మహమూద్ అలీ

ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలందరికీ ధోకా ఇచ్చిందని మాజీ మంత్రి మహమూద్ అలీ మండిపడ్డారు. 11 నెలల పాలనలో ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా అమలుచేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరైనా అధికారంలోకి రావడానికి రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారని, ఎన్టీఆర్ అలాగే పార్టీని పెట్టి ఎనిమిది నెలల్లోనే అధికారంలో వచ్చారని గుర్తుచేశారు. కానీ, తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పార్టీని స్థాపించి 14 ఏండ్లు పోరాడి కేసీఆర్ లక్ష్యాన్ని సాధించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ర్టానికి అసలైన యజమాని కేసీఆర్ అని, మిగతా పార్టీల నేతలు అందరూ కిరాయిదారులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, అబ్దుల్ ముఖీద్ పాల్గొన్నారు.

### నమ్మి ఓట్లేస్తే కాటేస్తున్న భస్మాసుర హస్తం

నమ్మి ఓట్లేస్తే కాంగ్రెస్ భస్మాసుర హస్తం కాటేస్తున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'శేలు దప్పినోడు శేను వెద్దె వడగండ్ల వానొచ్చి పోయిందట' అని ఎక్స్‌వేదికగా ఎద్దేవాచేశారు. '420 హామీల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రూ.15 వేలు రాకపాయె! రూ.2 లక్షల రుణమాఫీ కాకపాయె! 24 గంటల ఉచిత కరెంటు మాయమాయె! పంటల కొనుగోళ్లు చెయ్యకపాయె! వరి ధాన్యం క్వింటాలుకు బోనస్ రూ.500 ఇయ్యకపాయె!' అని విమర్శించారు. 'మేలుకో తెలంగాణ' అని కేటీఆర్ ఉద్బోధించారు.

### 11 నెలల పాలన 11 ఏండ్లను తలపిస్తున్నది: సబిత

రాష్ట్రంలో 11 నెలల కాంగ్రెస్ పాలన 11 ఏండ్ల దారుణ పాలనను తలపిస్తున్నదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. రైతులు మొదలు వ్యాపారవేత్తల వరకు కాంగ్రెస్ పాలన ఎప్పుడు పోతుందా? మళ్లీ కేసీఆర్ పాలన ఎప్పుడు వస్తుందా? అని ఎదురుచూస్తున్నారని అన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ప్రతిష్ట ఆకాశాన్ని అంటితే.. 11 నెలల రేవంత్‌రెడ్డి పాలనలో దానిని దిగజార్చే పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి ఆ పార్టీలో ఇమడలేక చాలా మంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. వారందరికీ బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేసీఆరే రాష్ర్టానికి శ్రీరామరక్ష అని మరోమారు స్పష్టంచేశారు.

> కేసీఆర్ అంటే వ్యక్తి కాదు.. బీఆర్‌ఎస్ అంటే సామాన్య శక్తి కాదు. కొందరు పిచ్చి కలలు కంటున్నరు. కేసీఆర్, బీఆర్‌ఎస్‌ను ఫినిష్ చేస్తా అని రేవంత్‌రెడ్డి అంటున్నడు. నీలాగ 24 ఏండ్లలో చాలా మంది ప్రగల్భాలు పలికారు.. పిచ్చి ప్రేలాపనలు చేశారు. కేసీఆర్‌ను ఫినిష్ చేస్తా అన్నవారే ఫినిష్ అయ్యారు. వాళ్లతోనే కాలేదు. నువ్వెంత?
>
> -కేటీఆర్

## లోకం పోకడ

దేశ రాజధానిలో వాయుకాలుష్యం..
రాష్ట్ర రాజధానిలో వాక్కు కాలుష్యం!

# అర్ధరాత్రి అరాచకం!

▸ Iవ తరువాయి...

చిట్లేలా.. కొట్టిన అరాచకాలు బయటి ప్రపంచానికి తెలుస్తున్నాయి. అరెస్టుల పేరుతో ఊరు మీద పడ్డ పోలీసులు, ప్రైవేట్ సైన్యం అడ్డగోలుగా దుర్భాషలాడుతూ, డొక్కల్లో తన్నుతూ, లైంగిక హింసను ప్రేరేపించేలా అర్ధరాత్రి నిర్లజ్జగా, అత్యంత వికృతంగా, అనాగరికంగా ప్రవర్తించిన తీరును కండ్లకు కట్టినట్టు చెప్పేందుకు బాధిత కుటుంబాలు బయటికొచ్చాయి. 11న సోమవారం రోజు అర్ధరాత్రి జరిగిన అరాచకాలపై నోరువిప్పుతూ ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పెద్ద అన్నదమ్ముల అరాచకాలను, ఆ రోజు పోలీసులు, వారితో పాటు వచ్చిన కొందరు 'ప్రైవేట్ సైన్యం' వికృతంగా ప్రవర్తించిన తీరును కండ్లకు కట్టినట్టు వివరించారు. పక్కమీద పడుకున్న వారిని అలాగే పెడరెక్కలు విరిచిపట్టి, కొట్టుకుంటూ వ్యాన్లలో పడేసిన దౌర్జన్యకాండను హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయం సాక్షిగా మీడియా ఎదుట బాధితులు కన్నీటిపర్యంతమవుతూ వివరించారు.

### లాఠీ దెబ్బలకు నా తల్కాయ పల్గింది



'అర్ధరాత్రి ఒంటిగంటకు వందల మంది పోలీసులొచ్చింఢ్రు. లాఠీలతోని తలుపులు పటా పటా కొడుతుండ్రు. మా ముసలోడు ఎవరయ్యా అంటే.. 'ఏయ్ ముసలోడా సప్పుడు చెయ్యకు' అని లాఠీలతోని బెదిరిస్తే. గమ్మునుండు. తలుపు తీసిన మా కోడలిని చెప్పలేని మాటలతో తిట్టుకుంట పోలీసులే లాఠీలతో కొట్టిండ్రు. చిమ్మ చీకట్లలో ఆడబిడ్డల ఎదల మీద చేతులేసి అసభ్యంగా చేసిండ్రు (ఏడ్చుకుంటూ).. ఆ దుర్మార్గాన్ని అడ్డుకోబోతే లాఠీలతో నన్నుకొడితే నా తలకు దెబ్బ తల్గి నెత్తురొచ్చింది.

– లక్ష్మీబాయి, పులిచర్లకుంట తండా

### ఒక్కో ఆడదాని మీదికి 10 మంది పోలీసులు



అర్ధరాత్రి ఇండ్లలోకి వచ్చి గొడ్లను బాదినట్టు బాదిండ్రు. తలుపు తియ్యక పోతే తాళాలు పగలగొట్టింఢ్రు. మగోళ్లు లేని ఇండ్లకు జొర్రి.. చెప్పుకోలేని ఇబ్బందులు పెట్టిండ్రు. వాళ్లు పగలొచ్చినా ఇంత భయపడే వాళ్లం కాదు. ఒంటిగంటకు ఒక్కో ఆడోళ్ల మీదకు 10 మంది పోలీసులు వచ్చిండ్రు. నన్ను కొడితే కాళ్లు, తొడలు కమిలి పోయినయ్. ఈ దెబ్బలు బయటికి చూపిస్తే.. నన్నేం జేస్తరోనని ఇన్నిరోజులు చెప్పుకోలే. 4 రోజులైనా కొట్టిన దెబ్బ తగ్గలేదు. నల్లగా కమిలిపోయింది చూడండి (బోరున విలపిస్తూ.. తొడపై కమిలిన లాఠీ దెబ్బలు చూపుతూ).

– లక్ష్మీబాయి కోడలు

### ఫార్మా కంపెనీ తెస్తనేందుకు తిరుపతిరెడ్డి ఎవరు?

ఇంత జరుగుతున్నా రేవంత్‌రెడ్డి మా ఊరు రాలేదు. గొడవలన్నీ అయిపోయినంక మా ఊరికి వస్తడా? ఆయన అన్నని తోలిండు. ఆయనేమన్న ఎమ్మెల్యేనా? ఎలాగైనా ఫార్మా కంపెనీని తీసుకొస్తామని చెప్పేటందుకు ఆయనెవరు? మావోళ్లను జైళ్లేసిండు. ఎందుకు తెస్తడు?

– గోపీబాయి, లగచర్ల

### తిరుపతిరెడ్డి ఎవనికి ఎంపీ, ఎమ్మెల్యే?



అసలు తిరుపతిరెడ్డి మాటిమాటికి ఎందుకొస్తుండు? ఆయన ఎవనికి ఎంపీ, ఎమ్మెల్యే? కూలిపని చేసుకుంటూ బతికే వాళ్లమే సార్. రేవంత్ రెడ్డి సార్ మంచి చేస్తడేమోనని ఓట్లేస్తే.. మమ్మల్ని తొక్కి పెడ్తున్నడు. నా బిడ్డకు ఒంట్లో బాగోలేకపోతే హాస్పట్లకు తీస్కపోయి సాయంత్రమొచ్చిన. గొడవ జరిగిందే తెలియదు. లైట్లు బంజేసి, కొట్టుకుంటూ కొడుకును తీస్కపోయిండ్రు. (ఏడ్చుకుంట)

– మున్నిబాయి, లగచర్ల

### కలెక్టరేట్ ముందు పెట్రోల్ పోసుకొని చస్తం



మా భూముల జోలికొస్తే ఊరుకునేది లేదు. వికారాబాద్ కలెక్టరేట్ ఆఫీసు ముందు అందరం పెట్రోల్ పోసుకొని చస్తాం. ఇదంతా కలెక్టర్ రావట్టే అయింది. ఆయనే చేస్తుండు తాకట్లు.. ఆయన వచ్చినప్పటి నుంచే కదా ఈ లొల్లి. మేము ఏం దోచుకున్నమని మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నరు? మమ్మల్నెవరూ ఉసిగొల్పలే.

– దేవీబాయి, బాధితురాలు

### సీఎంకు దమ్ముంటే మా ముందుకు రావాలె

ఫార్మా సిటీ భూముల కోసం ఎవ్వలెవ్వలోనో ఎందుకు పంపుతున్నవ్ సీఎం గారూ? మీకు దమ్ముంటే మీరే రావాలె. నువ్ మాకు బాగు చేస్తనంటేనే నీకు ఓట్లేసినం. ఇట్ల ఆగం చేస్తవనుకోలే. మాకు 4 వేల పింఛను రాకపాయె.

– సోనీబాయి, లగచర్ల

# లగచర్ల బాధితులకు అండగా ఉంటాం

- మహిళలపై దాడి చేసిన వారిని విడిచి పెట్టం
- భూములు ఇచ్చి చిప్పలు కడిగి బతకాల్నా?
- రాజ్యాంగ హక్కును ఎవరూ హరించలేరు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- కమిషన్‌కు లగచర్ల బాధితుల ఫిర్యాదు
- బీఆర్‌ఎస్ నేతలు సత్యవతి, ఆర్‌ఎస్పీ, అనిల్ జాదవ్, కోవలక్ష్మి సంఘీభావం

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు లగచర్ల బాధితుల సమస్యలు వివరిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు సత్యవతి రాథోడ్. చిత్రంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, అనిల్‌జాదవ్, కోవలక్ష్మి, జాన్సన్‌నాయక్, లగచర్ల బాధితులు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): లగచర్ల బాధితులకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య భరోసా ఇచ్చారు. లగచర్ల సహా సమీప గ్రామాల్లో కమిషన్ పర్యటిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో తనను కలిసిన లగచర్ల బాధితులతో ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడారు. వారికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్నారు. బాధితులకు మద్దతుగా వచ్చిన బీఆర్‌ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఆ పార్టీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్.. బాధితుల తరఫున చైర్మన్‌కు కలిసి వివరించారు. అనంతరం రాథోడ్, ఆర్‌ఎస్పీతో కలిసి లగచర్ల బాధితులు చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందచేశారు. పోలీసులు లంబాడీ మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన తీరు గురించి బాధిత మహిళలు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. తమ భూములను కాపాడాలని, గ్రామాల్లో అరెస్టు చేసిన తమ వారిని వెంటనే విడుదల చేయాలని, కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు.

### చిప్పలు కడుక్కొని బతకాల్నా?

లగచర్ల సంఘటన చాలా బాధాకరమని చైర్మన్ వెంకటయ్య ఈ సందర్భంగా తెలిపారు. అనాదిగా, వందల ఏండ్ల నుంచి భూమినే నమ్ముకుని బతుకుతున్న వారి నుంచి ఫార్మా కంపెనీల కోసం భూములు ఇవ్వాలని బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. ఫార్మా కంపెనీ ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ వ్యతిరేకం కాదని, రైతులు ఒప్పుకున్న భూముల్లో కంపెనీ నిర్మిస్తే ఇబ్బందులు ఉండవని అభిప్రాయపడ్డారు. ఎకరం, అర్దెకరం భూమినే నమ్ముకొని తండాల్లో బతుకుతున్న వారి భూములు ఫార్మా కంపెనీల కోసం ఇవ్వమంటే, వాళ్ల కుటుంబాలు ఏమైపోవాలని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో కార్మికులుగా, బేకరీలల్ల, హోటళ్లలో, ఇండ్లలో పనిచేసుకుంటూ చిప్పలు కడుక్కొని బతకాలా? అని ప్రశ్నించారు. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగాన్ని హరించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. దోషులపై కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### రేవంత్‌రెడ్డివి కక్ష రాజకీయాలు: సత్యవతి

సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా రాజకీయ కక్షలు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ హితవు పలికారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. రేవంత్ దుర్మార్గ పాలనకు పరాకాష్ఠకు లగచర్ల ఘటనే నిదర్శనమని పేర్కొన్నారు. దాడి చేశారన్న నెపంతో అమాయకులైన రైతులపై అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూమి మాత్రమే ఉన్నదా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తన అధికారం, దురహంకారం గిరిజనులపై చూపిస్తున్నాడని నిప్పులు చెరిగారు. ఫార్మా సిటీ ప్రయత్నాన్ని విరమించుకొని, గిరిజనులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ లగచర్లకొచ్చి వాస్తవాలను తెలుసుకోవాలని కోరా రు. అధికారులపై దాడిని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.

### పోలీసులపై అట్రాసిటీ కేసులు పెట్టాలి: ఆర్‌ఎస్పీ

లగచర్లలో బాధితులు అధికారులు కాదని, పేద గిరిజన మహిళలు అని బీఆర్‌ఎస్ నేత ఆర్ ప్రవీణ్ కుమార్ స్పష్టంచేశారు. తమపై అత్యాచార ప్రయత్నాలు జరిగాయని పలువురు మహిళలు స్వయంగా చెప్పారని తెలిపారు. ఈ మేరకు గిరిజన మహిళలపై దాడులు చేసిన పోలీసులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కమిషన్‌ను కోరామని మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. లగచర్ల గిరిజనులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ న్యాయం చేస్తుందని తాను నమ్ముతున్నానని తెలిపారు. జాతీయ మహిళా కమిషన్‌కు, జాతీయ ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

### భూముల కోసం సచ్చేందుకైనా సిద్ధం



మాకు రేవంత్‌రెడ్డి ఏమీ మంచి పనులు చేయలేదు. ఉన్న భూమున్నీ తీసుకుంటని అంటుండు. అల్లుడి కోసం, బావా బామ్మర్దుల ఫార్మా కంపెనీల కోసం మా భూములు కావాలంట. మేం రైతు బిడ్డలం. మా పేదల భూములే ఎందుకు తీసుకుంటున్నారు? రెడ్డీల భూములు లేవా? 'మాకు ఫార్మా వద్దు.. మా భూములు పోవద్దు. మా భూముల కోసం సచ్చేందుకైనా సిద్ధం. అధికారులపైన దాడి చేయలేదు. కలెక్టర్ వస్తడని మాకు చెప్పనేలేదు. రాహుల్‌గాంధీ.. ఏడున్నా మా కొడంగల్ గడ్డకు రావాలి. లేదంటే మేమే నీ దగ్గరకు వస్తం. మా వోళ్లందరినీ విడిచి పెట్టండి.

– జ్యోతి, లగచర్ల బాధిత మహిళ

### ఆడోళ్ల కుతికెలు పట్టుడు..



'పోలీసోళ్లు అర్ధరాత్రి ఇండ్లళ్లకు వచ్చి.. తలుపులు తీసి, ఆడోళ్ల కుతిక పట్టి పిసుకుడు, నెత్తి పగులకొట్టుడు అయింది. ఇదేం పద్ధతి. రాహుల్‌గాంధీకి, రేవంత్‌రెడ్డికి ఓటేస్తే మా ఆడోళ్ల మీదకు పోలీసుల్ని తోల్తరా? ఆల్లకు ఓటేస్తే మాకేమీ ఫాయిదా లేదాయే. ఉన్న భూముల్ని లాక్కునేందుకు మామీదనే దాడులాయే. ఇప్పటిదాకా రేవంత్‌రెడ్డి మాకేమీ ఇయ్యలేదు. ఆరు గ్యారెంటీలు అనుడే కానీ, ఇంతవరకు అమలే చేయకపాయే. మేము రైతు బిడ్డలం. భూముల మీద బతికిన వాళ్లం. మా భూములు ఎందుకివ్వాలి. మా తాత, ముత్తాతల నుంచి వస్తున్న భూములు.

– సుశీలాబాయి, లగచర్ల బాధిత మహిళ

అదుపులోకి తీసుకున్న వారిని పరిగి పోలీసు సర్కిల్ కార్యాలయానికి తరలిస్తున్న పోలీసులు

## మరో నలుగురు రైతుల అరెస్టు

పులిచెర్లకుంట తండా మహిళకు గుండెపోటు

హైదరాబాద్‌లో వైద్య చికిత్స

బిక్కుబిక్కుమంటున్న గిరిజనులు

కొడంగల్/పరిగి, నవంబరు 16: లగచర్ల ఘటన జరిగి వారం గడుస్తున్నా గిరిజనులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ ఘటనలో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా 20 మంది రైతులను అరెస్టు చేసిన పోలీసులు శనివారం మరో నలుగురు రైతులను అరెస్టు చేశారు. వారిలో నీరటి రాఘవేందర్, మదరయ్య, బసయ్య, గోపాల్ ఉన్నారు. వారిని పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఫార్మా బాధిత గ్రామాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పులిచెర్లకుంట తండాకు చెందిన ఓ గిరిజన మహిళ గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చేర్పించినట్టు సమాచారం. బాధిత గ్రామాల రైతులను పరామర్శించేందుకు వెళ్లిన సీపీఎం, వ్యవసాయం కార్మిక సంఘం, అంబేద్కర్ యువజన సంఘం నాయులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య, రమేశ్‌బాబును పోలీసులు అడ్డుకున్నారు.